క్లుప్తంగా

కర్రలతో దాడి.. ఇద్దరికి గాయాలు


దాడిలో గాయపడిన నాగేంద్రబాబు

దెందులూరు: కొవ్వలి కొత్తపేట రామాలయం సమీపంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా రోడ్డుపై పందిరి వేయడానికి అభ్యంతరం చెప్పడంతో తనను, తన కొడుకును కర్రలతో కొట్టి గాయపరిచారని మాకిన పెద్దిరాజు, మాకిన నాగేంద్రబాబు తెలిపారు. పందిరి కొంచెం పక్కన వేయండి లేదా ఖాళీగా స్థలంలో వేయమని చెప్పడంతో ఆగ్రహించిన మాకా నందు, మాకా వంశీ కర్రలతో దాడి చేశారన్నారు. బాధితులకు ఏలూరు ఆసుపత్రిలో చికిత్స అందించారు.

పేదలకు బియ్యం పంపిణీ

గణపవరం: గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రతి వారం నిర్వహిస్తున్న గుప్పెడు బియ్యం కార్యక్రమం ద్వారా సేకరించిన బియ్యాన్ని మంగళవారం గణపవరం సంత మార్కెట్, సాయిబాబా ఆలయం పరిసర ప్రాంతాల్లో పేదలు, బిచ్చగాళ్లు, వలస కుటుంబాల వారికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవా దృక్పథం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ రాణిదుర్గ, ఎన్ఎస్ఎస్ కన్వీనర్లు చైతన్య, వెంకట్రావు, వైస్ ప్రిన్సిపాల్ కె.స్వరూపరాణి, జి.వెంకట రమణ, భాస్కరావు, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

చింతమనేని ఆగడాలు అడ్డుకుంటాం


పీవీ రావు

ఏలూరు రూరల్: దెందులూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిపై చింతమనేని, అనుచరులు దాడులు చేయడం అన్యాయమని వైఎస్సార్ సీపీ నాయకుడు పీవీ రావు అన్నారు. మంగళవారం ఆయన అబ్బయ్యచౌదరితో మాట్లాడారు. కొల్లేరు ప్రజలను అడ్డు పెట్టుకొని చింతమనేని ప్రభాకర్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభాకర్‌కు సత్తా ఉంటే వైఎస్సార్ సీపీ హయాంలో దెందులూరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిలో 10 శాతం చేసి చూపాలన్నారు. కూటమి ప్రభుత్వంలో టీడీపీ నాయకుల అరాచకాలు ఎక్కువయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు అధికారుల అండతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని దుయ్యబట్టారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గ ప్రజలు కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని జోస్యం చెప్పారు.

ఎరువుల గోడౌన్లపై విజిలెన్స్ దాడులు


ఎరువుల గోడౌన్ తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

గణపవరం: గణపవరంలోని పలు ఎరువుల దుకాణాలు, గొడాములపై విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1.84 లక్షల విలువైన 128 పొటాష్ ఎరువుల బస్తాలను సీజ్ చేశారు. విజిలెన్స్ సీఐ శివ రామకృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం గణపవరంలోని పులవర్తి ఫెర్టిలైజర్స్ దుకాణంలో బ్యాలెన్స్‌కు భౌతిక నిల్వలకు తేడా రావడంతో 6ఏ కేసు నమోదు చేసి, 128 బస్తాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఎరువులను ఎంఆర్‌పీ ధరకే విక్రయించాలని, బ్లాక్ మార్కెట్, అక్రమ నిల్వలు చేయొద్దని వ్యాపారులను హెచ్చరించారు. మండల వ్యవసాయ అధికారి ఆర్ఎస్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పెదవేగిలో తనిఖీలు


ఎరువుల తనిఖీలు చేస్తున్న ఏఓ, ఎస్సై

పెదవేగి: ప్రభుత్వం నిర్దేశించిన నియమాలతోనే ఎరువులు విక్రయించి న్యాయమైన రీతిలో రైతులకు ఎరువులు పంపిణీ చేయాలని పెదవేగి మండల వ్యవసాయాధికారి సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. జాయింట్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా పెదవేగి మండలం కూచింపూడిలో వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఎస్సై కె.రామకృష్ణ సంయుక్త ఆధ్వర్యంలో జీవీఆర్ ఎంటర్ ప్రైజెస్ ఫెర్టిలైజర్ షాపులో తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి, స్టాక్ వివరాలను తనిఖీ చేశారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

లింగపాలెం: జిల్లా ముఖ్య కార్య నిర్వాహణ అధికారి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు ఎం.శ్రీహరి మండలంలోని యడవల్లి గ్రామ పంచాయతీని సందర్శించారు. గ్రామ పంచాయతీ నందు శానిటేషన్ పనులను పరిశీలించారు. ప్రతి ఇంటి నుంచి తడి చెత్త పొడి చెత్త వేరు చేసి చెత్తను సేకరించుట, ఐవీఆర్ఎస్ కాల్స్‌పై ప్రజలకు అవగాహనను కల్పించుట, ఎస్‌డబ్ల్యూపీసీ పనులను పరిశీలించారు.

మట్టి విగ్రహం.. పర్యావరణ హితం


భీమడోలు: పూళ్లలో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న మట్టి గణేష్ విగ్రహాలు


దెందులూరు: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం విజయ్‌కుమార్

- మట్టి వినాయకుడిని పూజిద్దాం, పర్యావరణాన్ని రక్షిద్దాం
- 27వ తేదీ నుంచి గణేష్ ఉత్సవాలు ప్రారంభం

భీమడోలు: ప్రకృతి ఆరాధన విలీనమైన పండుగ వినాయక చవితి. ఎంతో మంది ఈ విషయాన్ని పట్టించుకోకుండా హంగూ అర్భాటాలకు పోయి రసాయన రంగులతో కూడిన భారీ గణనాథుని విగ్రహాలను నెలకొల్పుతున్నారు. మట్టితో వినాయకుని విగ్రహాలు చేసి నవరాత్రులు పూజలు చేసి వాటిని చెరువులు, కంటలు, నదుల్లో పూజా పత్రితో పాటు కలపడం వలన జలాలు శుద్ధి అవుతాయని పర్యావరణ ప్రేమికులు అంటున్నారు. గణపతి తత్వం పృథ్వీమయం అని పురాణాల్లో ఉంది. పృథ్వీ అంటే భూమి అని, భూమిలో లభించే మట్టితోనే ఆయన ప్రతిమను తయారు చేసి పూజించాలని పండితులు చెబుతున్నారు. దీనికి భిన్నంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన పెద్ద విగ్రహాలను జల వనరుల్లో కలిపి నీటి కాలుష్యానికి కారణమవుతున్నారు. పూళ్లకు చెందిన విగ్రహాల కళాకారుడు యర్రవరపు బుల్లియ్య దశాబ్దాలుగా మట్టితో వినాయక విగ్రహాలను తయారు చేయడంలో దిట్ట. పర్యావరణం హితంగా ఉండే బంకమట్టి, సిమెంట్, సున్నంతో విగ్రహాలను తయారు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆరు నెలలుగా తన కుటుంబంతో పాటు పలువురికి ఉపాధిని కల్పిస్తున్నారు.

నేటి నుంచి గణనాథుని ఉత్సవాలు ప్రారంభం

ఈనెల 27వతేదీ నుంచి 9రోజులపాటు వాడవాడలా గణేష్ ఉత్సవాలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు సిద్ధంచేసుకున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల్లోని పల్లెలు, పట్టణాల్లో వందలాది విగ్రహాలు ఏర్పాటు చేశారు.

భారీ విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు ఉండాల్సిందే

గణేష్ ఉత్సవాల్లో భారీ విగ్రహాలను నెలకొల్పే ప్రాంతాల్లో సీసీ టీవీలను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత కమిటీ సభ్యులదేనని భీమడోలు సీఐ యూజే విల్సన్ అన్నారు. భీమడోలులో మంగళవారం చవితి మండపాలను ఏర్పాటు చేసే ప్రాంతాలను ఎస్సై వై.సుధాకర్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ యూజే విల్సన్ మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణకు విధిగా అనుమతులు తీసుకోవాలని, ఆ ప్రాంతాలు శుభ్రంగా, సురక్షితంగా ఉండేలా చూసుకోవాలన్నారు. నాలుగు అడుగులు దాటిన విగ్రహాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఏఈ కె.శివాజీ, డిప్యూటీ తహసీల్దార్ కామేశ్వరరావు, ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

చవితి వేడుకలకు సిద్ధం

పెదవేగి: పల్లెలు గణపతి నవరాత్రుల శోబతో కలకల్లాడుతున్నాయి. వినాయకచవితి పురస్కరించుకుని దాదాపు అన్ని గ్రామాల్లో సాధారణ స్థాయి నుంచి భారీ పందిళ్లను ఏర్పాటు చేసి, సౌండ్ బాక్సుల ఏర్పాటు, భారీ విగ్రహాల కొనుగోలు వంటి పనులను చిన్నా, పెద్దా తేడా లేకుండా సందడి సందడిగా నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రమైన ఏలూరు నుంచి పెదవేగి పరిసర పల్లె గ్రామాలకు వచ్చి, కొబ్బరి కాయలు, ఆకులు, మామిడి ఆకులు తదితర పత్రి వస్తువులను సేకరిస్తున్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు

ఉంగుటూరు: వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. ఉంగుటూరు, నారాయణపురం, చేబ్రోలు, కైకరం , తదితర గ్రామాలలో ఆలయాల వద్ద ముస్తాబు చేశారు. విద్యుత్ అలంకరణలు మధ్య చూడ ముచ్చటగా కనిపించింది. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వినాయకుని పందిర్లు వద్ద శోభయమానంగా తీర్చిదిద్దారు. మంగళవారం కురిసిన వర్షం ఉత్సవ కమిటీ సభ్యులకు కొంత ఇబ్బంది కలిగించినా అధికమించి ఆలయాల వద్ద ఉత్సవ పందిళ్లు ఏర్పాట్లు చేశారు.

మట్టి వినాయకుని పూజిద్దాం – పర్యావరణాన్ని రక్షిద్దాం

గణపవరం: మట్టి వినాయకులను పూజిద్దాం- పర్యావరణాన్ని రక్షిద్దాం అంటూ చిన్నారులు మట్టి, కాగితం, ఆకులతో వినాయక ప్రతిమలను తయారు చేసి తాము పర్యావరణ ప్రేమికులమని నిరూపించుకున్నారు. గణపవరం లయన్స్ క్లబ్, మానవత సంస్థలు మట్టితో చేసిన వినాయకుని విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసి పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ సభ్యులు వెల్లంకి నరేష్, కిలారి రవిబాబు, కె.సత్యనారాయణ, కాకర్ల వినాయక, ఆర్ఎస్‌ప్రకాశ్, ఎంఎస్ఎల్ఎస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వినాయక ప్రతిమల తయారీ పోటీలు

దెందులూరు: వినాయకపూజ నిమజ్జన సమయాల్లో శబ్ద, వాయు, జల కాలుష్యంలేకుండా చేసుకోవాలని క్లబ్ నిర్వాహకులు తెలిపారు. గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాల ప్లస్‌లో మంగళవారం క్లబ్ నిర్వాహకురాలు ఉపాధ్యాయురాలు బీఎస్ఎన్‌కే కళ్యాణి విద్యార్థులకు వినాయక ప్రతిమల తయారీ పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వడ్లపట్ల విజయ్ కుమార్ ప్రథమ సహాయకులు డాక్టర్ జీవీవీ నారాయణ, స్టాఫ్ సెక్రటరీ బి.సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు మట్టి విగ్రహాలనే ఉత్సవాలకు ఉపయో గించాలన్నారు. పోటీల్లో విజేతలకు ప్రధానోపాధ్యాయులు విజయకుమార్ బహుమతులు అందజేశారు.

వాడవాడలా గణేష్ ఉత్సవాలకు ఏర్పాట్లు

పెదపాడు: మండలంలో వాడవాడలా వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. పెదపాడు మండలంలోని అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఏలూరు తహసీల్దార్ గాయత్రి మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. పెదపాడులోని గండి చెరువు గట్టు వద్ద 8 అడుగల విగ్రహాన్ని నెలకొల్పేందుకు కమిటీ సభ్యులు, పెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

సింగిల్‌విండో విధానంలో అనుమతులు



సింగిల్ విండో విధానంతో వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు ఇస్తున్నాం. నిర్వాహకులు ఆయా శాఖల చుట్టూ తిరగకుండా సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని ప్రభుత్వం ప్రకటించింది. మండపం ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్నట్లయితే ఆయా శాఖల నుంచి అనుమతులు వెంటనే వస్తాయి. వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తి భావంతో జరుపుకోవాలి. ఎక్కడైనా చిన్న సమస్య చోటు చేసుకున్నా సంబంధిత కమిటీలదే బాధ్యత.

– వై.సుధాకర్, ఎస్సై, భీమడోలు

మట్టి వినాయకుడినే పూజిద్దాం



పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత. తెలుగు ప్రజలు వాడవాడలా నిర్వహించే వినాయక చవితి వేడుకలను పర్యావరణ హితం కాంక్షిస్తూ చేసుకోవాలి. మట్టి వినాయకునికి పూజలు చేద్దాం. రసాయనాలతో తయారు చేసే పీవోపీ విగ్రహాలకు దూరంగా ఉందాం. చెరువులు, కాలువలు, నదుల్లో నిమజ్జనం చేస్తే పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతుంది. మట్టి విగ్రహాల వలన పర్యావరణానికి మేలు కలుగుతుంది.

– తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, మానవత జిల్లా డైరెక్టర్, భీమడోలు


భీమడోలు: ఉత్సవ కమిటీ నిర్వాహకులకు సూచనలిస్తున్న సీఐ యూజే విల్సన్


పెదవేగి: వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు వేసిన పందిరి


గణపవరం: పచ్చని ఆకులతో వినాయకుని ప్రతిమలు తయారు చేసిన విద్యార్థులు

సేంద్రియ వ్యవసాయమే మేలు


దెందులూరు: రైతులకు సూచనలు చేస్తున్న ఏడీ అనిల్ కుమార్


పెదవేగి: పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

దెందులూరు: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సేంద్రియ వ్యవసాయం రైతులకు ఎంతో మేలని వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం గ్రామంలో దెందులూరు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎల్.శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ అనిల్ కుమార్ వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ ప్రాముఖ్యత సేంద్రియ వ్యవసాయం సాగు ఉపయోగాలు భూసారం ఇతర వ్యవసాయ సంబంధిత అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దెందులూరు గ్రామ సర్పంచ్ తోట ఏసమ్మ, నీటి సంఘం అధ్యక్షులు పర్వతనేని రంగారావు, రైతులు ఉన్నారు.

రసాయన ఎరువుల వాడకం భూమికి దెబ్బ

పెదవేగి: రసాయన ఎరువుల వాడకం వలన భూమి ఆరోగ్యం దెబ్బ తింటుందని భూమిలో పంటకు ఉపయోగపడే సూక్ష్మజీవులు చనిపోతాయని మండల వ్యవసాయాధికారి సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. పెదవేగి మండలం వంగూరు, జగన్నాధపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న హార్టికల్చర్ ఏడీహెచ్ సంతోష్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ తోటలకు యూరియా వాడకం కన్నా అమోనియం సల్ఫేట్ ఎరువును వాడటం వలన ఆయిల్ దిగుబడి పెరుగుతుందని పంట లాభదాయకంగా ఉంటుందని రైతులకు వివరించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ రత్నమాల, పశు వైద్యాధికారి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల బాధ్యత ప్రత్యేక టీములదే


కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

భీమడోలు: వినాయకుని ఉత్సవాలు ప్రశాంతంగా ఎటువంటి ఆటంకాలు జరగకుండా గ్రామాల్లో ప్రత్యేక టీములను ఏర్పాటు చేశామని తహసీల్దార్ బి.రమాదేవి అన్నారు. భీమడోలు తహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం గణేష్ ఉత్సవాల సందర్భంగా పలు శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎటువంటి అల్లర్లు, అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వవద్దన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్, ఫైర్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ ఏఈ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గణేష్ పూజా పత్రికి ధరాఘాతం

గణేష్ పూజా పత్రి ధరలు రెట్టింపు అయ్యాయి. వినాయకుని వ్రత పూజా సామాగ్రికి గతేడాది కన్నా అధిక ధరలు పలకడం, వర్షాల వలన విక్రయాలు లేక దుకాణాలు వెలవెలబోయాయి. మట్టి వినాయకుని విగ్రహం ధర రూ.100 కన్నా ఎక్కువ. 21 రకాల పత్రీ ఆకుల్లో కేవలం 13 ఆకులను కట్టి రూ.50 తీసుకుంటున్నారు.

గణపవరాన్ని ఏలూరులో కలపొద్దు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

గణపవరం: గణపవరం మండలాన్ని ఏలూరు జిల్లాలో కలపొద్దని, పశ్చిమగోదావరి జిల్లాలోనే కొనసాగించాలని గణపవరం మండల కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ వైకేవీ అప్పారావుకు వినతిపత్రం సమర్పించారు. గణపవరం మండలం ఏలూరు జిల్లా కేంద్రానికి 70 నుంచి 90 కిలోమీటర్ల దూరంలో ఉంటుందని, దీంతో ప్రజలు ఇబ్బంది పడతారన్నారు. కేవీపీఎస్ మండల అధ్యక్షుడు చిన్నం నాగేశ్వరరావు, వరదరాజపురం సర్పంచ్ గుర్రం సుబ్బారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం దగ్ధం


దగ్ధమైన ద్విచక్రవాహనం

దెందులూరు: జాతీయ రహదారిపై వట్లూరు-కలపర్రు హైవే మధ్య మంగళవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం విజయవాడ నుంచి ఏలూరు వచ్చి పని ముగించుకొని తిరిగి విజయవాడ ద్విచక్ర వాహనంపై ఇద్దరూ వెళుతున్నారు. వర్షానికి ద్విచక్ర వాహనం జారి పడి మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం పెట్రోల్ పైపు వలన మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు ఎల్ఈడీ బోర్డుల టెక్నీషియన్లు సురక్షితంగా బయట పడ్డారు.

మానవతామూర్తి మదర్ థెరీసా


భీమడోలు: మానస స్కూలులో పేదలకు నిత్యవసరాలు, భోజనం అందజేస్తున్న దృశ్యం


దెందులూరు: మదర్ థెరీసా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న సీహెచ్‌సీ వైద్యులు


గణపవరం: కాశిపాడులో మదర్ థెరిసా విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

గణపవరం: మదర్ థెరిసా జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, ఆమె సేవలు కొనసాగించడమే మనం ఆమెకు ఇచ్చే నివాళి అని పలువురు అన్నారు. మండలంలోని కాశిపాడులో క్షత్రియ సేవాసమితి, జిల్లా పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మదర్ థెరిసా జయంతిని పురస్కరించుకొని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.నాగరాజు, జిల్లా పీఎంపీ అధ్యక్షుడు పరమేశ్వర్లు, అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

దెందులూరులో..

దెందులూరు: విశ్వమాత మదర్ థెరిసా సేవలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తి కావాలని దెందులూరు సీహెచ్‌సీ వైద్యాధికారి నాయక్ అన్నారు. మంగళవారం దెందులూరు సీహెచ్‌సీలో సూపరింటెండెంట్ డాక్టర్ సుందర్‌కుమార్ ఆధ్వర్యంలో మదర్ థెరిసా జయంతిని నిర్వహించారు. వైద్య సిబ్బంది మదర్ థెరిసా విగ్రహానికి పూలమాలువేసి నివాళులర్పించారు

మదర్ థెరీసా ప్రపంచానికి ఆదర్శం

నోబుల్ ప్రైజ్ అవార్డు గ్రహీత భారతరత్న మదర్ థెరిసా ప్రపంచానికి ఆదర్శనీయమని ఆర్‌సీఎం ఏలూరు పీఠం జనరల్ డాక్టర్ పి బాల అన్నారు. మంగళవారం సోమవరప్పాడు సెయింట్ జాన్స్ బీఈడీ కళాశాలలో మదర్ థెరిసా జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆమె చేసిన సేవలు కొనియాడారు. 1992 డిసెంబర్ 8 కలకత్తాలోని మదర్ హోమ్‌లో మదర్‌థెరిసాను తాను కలిశానన్నారు. నేరుగా కుష్టు వ్యాధిగ్రస్తులకు ఆమె చేసిన సేవలను చూశానన్నారు. మదర్ థెరిసా లాంటి మహోన్నతమైన సేవాస్ఫూర్తి గల వ్యక్తిని కలవడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు.

భీమడోలులో..

భీమడోలు: నోబెల్ శాంతి పురస్కార అవార్డు గ్రహీత మదర్ థెరీసా జీవితం ఆదర్శప్రాయమని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం, మానస ఇంగ్లీషు మీడియం పాఠశాల, భీమడోలు శాఖా గ్రంథాలయంలో మంగళవారం భారతరత్న, మానవతా మూర్తి మదర్‌దెరిస్సా 125వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి వద్ద థెరిస్సా విగ్రహానికి డాక్టర్ ఆనంద్, ఆస్పత్రి కమిటీ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మానస పాఠశాలలో 50 మంది నిరుపేద కుటుంబాల మహిళలకు దుప్పట్లు, దుస్తులు, మందులు, బిస్కెట్లు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ వై.రవీంద్రకుమార్ విద్యార్థుల చేతుల మీదుగా వాటిని అందజేశారు.

ఆధునిక సాంకేతికతను పాటించాలి


రైతులకు డ్రోన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులతో వ్యవసాయం చేయాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మంగళవారం ఉంగుటూరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద రైతులకు డ్రోన్లను పంపిణీ చేశారు. 80 శాతం రాయితీతో అందిస్తున్న డ్రోన్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్, ఏఎంసీ చైర్మెన్ జ్యోతి అయ్యప్ప, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పి.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం

దెందులూరు: గ్రామాల్లో ఆధ్యాత్మిక మరింత అభివృద్ధి చెందాలని ఏపీ డైరెక్టర్ రెవరాండ్ ఎం.మోజెస్ అన్నారు. మంగళవారం కొవ్వలిలో రేగు చెట్టు వారి వీధిలో వీఎల్‌జీఎం చర్చి వార్షికోత్సవం వ్యవస్థాపకులు బండి సిల్వర్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

వరకట్న వేధింపులపై కేసు

జంగారెడ్డిగూడెం: భార్యను వేధిస్తున్న భర్త, ఆమె అత్తపై మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసినట్లు స్టేషన్ రైటర్ బాబూరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. వివరాల ప్రకారం పాడిశెట్టి పావని లక్ష్మీప్రసన్నకు 2022లో శ్రీను అనే వ్యక్తి తో వివాహమైంది. వివాహ సమయంలో రూ. 2లక్షలు కట్నం ఇచ్చారు. అయితే ఇటీవల శ్రీను వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని ప్రసన్నను అధికకట్నం భర్త, అత్త వేధిస్తున్నారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.

రియాన్స్‌కి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు


రికార్డును చూపుతున్న రియాన్స్

కొయ్యలగూడెం: ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కొల్లూరు రియాన్స్ అనే బాలుడు చోటు సంపాదించాడు. కొయ్యలగూడేనికి చెందిన ప్రముఖ గుండె వైద్యులు డాక్టర్ కొల్లూరు లక్ష్మణ్ కుమారుడైన కొల్లూరు రియాన్స్ చిన్న వయసులో జాతీయస్థాయి లో అరుదైన గుర్తింపు పొందారు. రాజమండ్రిలోని ప్రైవేట్ స్కూల్లో మూడవ తరగతి విద్యనభ్యసిస్తున్న ఏడు సంవత్సరాల వయస్సు కలిగిన రియాన్స్ 101 కౌరవుల పేర్లు అతి తక్కువ సమయం 48.10 సెకండ్‌లో అనర్గళంగా వేగంగా చెప్పి అరుదైన జాతీయస్థాయి రికార్డుని నెలకొల్పాడు.

విద్యార్థులపై శ్రద్ధ చూపాలి

లింగపాలెం: ప్రాథమిక పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల విద్యాశాఖ అధికారి జంగం రవీంద్ర కోరారు. మంగళవారం మండలంలోని అయ్యప్పరాజుగూడెం పంచాయతీ ప్రగతిపురం ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు తమ్మలాల రామ్మోహన్ రావు ఉపాధ్యాయిని సంతోషం విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాఠశాల తనిఖీ



పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈఓ అన్నమ్మ

దెందులూరు: మండల విద్యాశాఖ అధికారి అన్నమ్మ గురువారం దెందులూరు సెయింట్ మేరీస్ యూపీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలను తనిఖీ చేశారు. యూ డైస్ ఎఫ్ఏ వన్ మార్కుల నమోదు డ్రాప్ బాక్స్ విషయాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు, విద్యుత్, మరుగు దొడ్లు, క్రీడా స్థలంతో పాటు పాఠశాలలో సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాల హెచ్ ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రిడ్జి వద్ద స్తంభాల తొలగింపు



నాచుగుంట బ్రిడ్జి వద్ద స్తంభాలను తొలగిస్తున్న కూటమి నాయకులు

ఉంగుటూరు: జాతీయ రహదారిని ఆనుకుని నాచుగుంట బ్రిడ్జి ఎక్కే చోట వాహనాల దూకుడు కట్టడి చేయడానికి హైవే అథారిటీ అధికారుల ఆదేశాలతో టోల్ ప్లాజా సిబ్బంది సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేశారు. అలాగే ఉంగుటూరు ఊరిలో నుంచి వెళ్లే లోడు లారీలు నియంత్రించేందుకు నాచుగుంట వద్ద గడ్డర్లు ఏర్పాటు చేసేందుకు ఇనుప స్తంభాలను ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న కూటమి నాయకులు కాగుపాడు నుంచి కింది గ్రామాలకు ఏకై క రహదారి ఇదొక్కటేనని గడ్డర్లు వేస్తే ఎలా అని టోల్ ప్లాజా సిబ్బంది ఏర్పాటు చేసిన స్తంభాలను తొలగించారు. టోల్ ప్లాజా సిబ్బంది వారిని ఆపలేకపోయారు. దీంతో గడ్డర్ల ఏర్పాటు పనులు నిలిచిపోయాయి.

ఆధ్యాత్మికతతోనే సర్వం సాధ్యం



ఆరోగ్యమాత ఉత్సవాల్లో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

దెందులూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన సత్ప్రవర్తన దేవునికి ఇష్టమైన రీతిలో జీవన విధానంతోనే సర్వం సాధ్యపడుతుందని సానిగుడెం మేజర్ సెమినరీ రెక్టర్ ఫాదర్ జోస్ పాల్ అన్నారు. గురువారం వేగవరం ఆర్‌సీఎం చర్చి పారిస్ పేస్ట్ ఫాదర్ ఎల్.మోజస్ సంఘ పెద్దలు ఆధ్వర్యంలో జరుగుతున్న వేళంగిని ఆరోగ్యమాత ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. తొలుత ఫాదర్ మోజెస్‌తో కలిసి ఆయన దివ్య బలి పూజ అర్పించారు. వేలంగిని ఆరోగ్య మాత దీవెనలు ప్రతి ఒక్కరికీ కలగాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉత్సవాల్లో గోపన్నపాలెం, వేగవరం, మసీదుపాడు, కొత్తపల్లి, చల్లపల్లి, సోమవరప్పాడు, వీరభద్రపురం సమీప గ్రామాల్లో విశ్వాసులు పాల్గొన్నారు.

ఏపీ గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్‌గా సక్కు కుమారి

దెందులూరు: ఏపీ గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్‌గా దెందులూరు మాజీ జడ్పీటీసీ, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు ముమ్మడి చింతయ్య సతీమణి ముమ్మడి సక్కుకుమారి నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేసింది.

జ్యోత్స్న దేవికి స్టేట్ అవార్డు



జ్యోత్స్న దేవి

ఉంగుటూరు: నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న ముగ్గురు అధ్యాపకులకు స్టేట్ అవార్డులు లభించాయి. ఈ ఏడాది కామర్స్ అధ్యాపకురాలు జ్యోత్స్న దేవికి స్టేట్ అవార్డు వచ్చింది. ఇదే కాలేజీలో 2011లో బీవీ శ్రీనివాస్, 2024లో రామచంద్ర రావు స్టేట్ అవార్డులు తీసుకున్నారు. పలువురు జ్యోత్స్నదేవిని అభినందించారు.

జేసీ ఆకస్మిక తనిఖీలు

ద్వారకాతిరుమల: మండల కేంద్రమైన ద్వారకాతిరుమలలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, అలాగే దొరసానిపాడులోని ఎరువుల దుకాణాన్ని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ఆమె ద్వారకాతిరుమలలోని అంగన్‌వాడీ కేంద్రం-3ను పరిశీలించి, మధ్యాహ్న భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె పిల్లలతో ముచ్చటించారు. తరువాత దొరసానిపాడు పరిధిలోని వేపాలమ్మ ఆలయ సమీపంలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసిన ఆమె రికార్డులను పరిశీలించారు.

వైఎస్సార్ సీపీ గ్రామాధ్యక్షుల నియామకం

జంగారెడ్డిగూడెం: మండలంలోని నిమ్మలగూడెం, లక్కవరం, దేవులపల్లి గ్రామాలకు వైఎస్సార్ సీపీ గ్రామాధ్యక్షులను నియమించినట్లు చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు తెలిపారు.

వంతెనకు శాశ్వత పరిష్కారం ఎప్పుడో?

- దాతల సాయంతో మరమ్మతులు
- పెదవి విరుస్తున్న ప్రజలు



నారాయణపురం వంతెనకు మరమ్మతులు చేస్తున్న కూలీలు

ఉంగుటూరు: మండలంలోని నారాయణపురంలో ఏలూరు కాలువపై ఉన్న బ్రిటిష్ కాలం నాటి వంతెన కు జూన్ 15న రంధ్రం పడింది. అప్పటి నుంచి వాహనాల రాకపోకలు నిలిపివేశారు. అయితే కొత్త వంతన ప్రభుత్వం కట్టిస్తుందని ప్రజలు ఆశించారు. మరమ్మతులు ప్రారంభించడంతో ప్రజల ఆశలపై నీళ్లు చల్లినట్టైంది. వంతెన రంధ్రం ఎపడిపోవడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు రూ.8.50 కోట్ల ప్రతిపాదన తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో ప్రత్యామ్నాయ రహదారులు అభివృద్ధి పరిచి ఆ రహదారుల వెంబడి లారీలు నడుతున్నారు. దీంతో దాతల సహకారంతో ఈ వంతెనపై చిన్న వాహనాలు వెళ్లేందుకు మరమ్మతులు చేపట్టారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం పాదాచారులు సైతం అతికష్టం మీద అటూ ఇటూ నడుస్తున్నారు. ఈ వంతెనకు ప్రత్యామ్నాయం చూపకపోవడంతో ప్రజల కష్టాలు దేవుడికెరుక అన్న చందంగా తయారైంది. ఇది బ్రిటిష్ కాలం నాటి బ్రిడ్జి కావడంతో నీరు బ్రిడ్జి కిందకు చేరి ఊసలు పాడైపోయాయి.

డెల్టా ప్రాంతానికి ప్రధాన వంతెన

తెల్లారి లేస్తే వేలది మంది ప్రజలు ఐస్ పరిశ్రమల కార్మికులు ఈ బ్రిడ్జిపై నుంచి తిరగాల్సి ఉంది. భీమవరం నుంచి జంగారెడ్డిగూడెం వైపు వాహనాలు ఇటుగా తిరగాల్సి ఉంది. అలాగే భీమవరం ప్రాంత ప్రజలు జాతీయ రహదారి పైకి చేరుకుని విజయవాడ, రాజమండ్రి వైపు ప్రయాణాలు సాగిస్తుంటారు. అలాంటి ప్రయాణాలు ప్రస్తుతం నిలిచిపోయాయి. కొందరు పుంత రహదారుల మీదుగా హైవేకు చేరుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. కొత్త బ్రిడ్జి నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ డీఈ గోవింద మోహన్ ప్రశ్నించగా కొత్త బ్రిడ్జి నిర్మాణానికి రూ.8.50 కోట్ల ప్రతిపాదన ప్రభుత్వానికి పంపామని తెలిపారు. పస్తుతం చేస్తున్న మరమ్మతులు దాతల సహకారంతో మొదలు పెట్టినవేనని, ప్రభుత్వం ఏమీ ఇవ్వ లేదని చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో మరమ్మతులు చేస్తున్నారని తెలిపారు. 15 రోజుల వ్యవధిలో మరమ్మతులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. భారీ లోడు వాహనాలు తిరగడానికి వీలు లేకుండా గడ్డరు ఏర్పాటు చేస్తామని వివరించారు.

ప్రత్యామ్నాయం లేకుండా మరమ్మతులు చేస్తే ఎలా?

ప్రత్యామ్నాయం చూపకుండా బ్రిడ్జి మరమ్మతులు చేస్తే ప్రజలు కాలువ ఎలా దాటతారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ మేరకు కొంత మంది బ్రిడ్జి పనుల వద్ద ఆందోళన చేశారు. అయితే మూడు రోజుల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు చెప్పారు. రోజుకు 500 మంది విద్యార్థులు ఈ వంతెనపై ప్రయాణిస్తారని తెలిపారు.

> **“ శాశ్వత బ్రిడ్జి నిర్మించాలి**
>
> మరమ్మతులు చేసి వదిలేయడం పరిష్కారం కాదు. జిల్లాలో ప్రధానమైన వంతెనగా ఉన్న నారాయణపురం వంతెనకు నిధులు అత్యవసర విధానంలో మంజూరు చేయించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధులు నిధులు మంజూరుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. తాత్కాలిక మరమ్మతుల వలన పెద్దగా ప్రయోజనం ఉండదు. ఇక్కడి నుంచి వందలాదిగా లారీలు చేపల లోడులు ఈశాన్య రాష్ట్రాలకు వెళ్లాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వ్యాపారాలు స్తంభించిపోయే ప్రమాదం ఉంది. ఉనికి దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుంది.
>
> –మరడ మంగరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

పెదపాడు: ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు దాడులు చేసి రూ.9,03,520 విలువైన 34 టన్నుల ఎరువులను స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ డీఎస్పీ సింగలూరి వెంకటేశ్వరరావు తెలిపారు. విజిలెన్స్ డీజీ హరీష్‌కుమార్ గుప్తా, ఏలూరు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పి.మహేష్ ఆదేశాల మేరకు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అప్పనవీడులోని శ్రీనివాసా ఏజన్సీస్, శ్రీకృష్ణ ఆగ్రో ఏజన్సీస్‌లను తనిఖీ చేశారు. శ్రీనివాసా ఏజన్సీస్‌లో 29.05 మెట్రిక్ టన్నులు, శ్రీకృష్ణ ఆగ్రో ఏజన్సీస్‌లో 3.950 మెట్రిక్ టన్నులు ఎరువులను సీజ్ చేశారు. వీటి విలువ రూ. 9,03,520లు ఉంటుందని చెప్పారు. దుకాణ యజమానులపై నిత్యావసర వస్తువుల చట్టం 1995 ప్రకారం 6(ఏ) కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ, విజిలెన్స్ ఏఓ జి.మీరయ్య, విజిలెన్స్ ఎస్సై సీహెచ్ రంజిత్ కుమార్, కె.సీతారాం, వ్యవసాయ అధికారి షేక్ ఇమామీ ఖాసిమ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా నిల్వల తనిఖీ



యూరియా నిల్వలను తనిఖీ చేస్తున్న ఎస్పీ శివ కిషోర్

దెందులూరు: రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సకాలంలో యూరియా సరఫరా చేయాలని జిల్లా ఎస్పీ కె.ప్రతాప శివకిషోర్ ఆదేశించారు. రైతుల నుంచి యూరియా సరఫరా పంపిణీకి సంబంధించి ఎటువంటి ఫిర్యాదులు రాకూడదన్నారు. వ్యవసాయ శాఖ ఉద్యోగులు రైతులతో మమేకమై సాగుకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా విధులు నిర్వహించాలన్నారు. పెరుగ్గూడెం కో–ఆపరేటివ్ సొసైటీ గోడౌన్‌లోని యూరియా నిల్వలను గురువారం జిల్లా ఎస్పీ, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ హబీబ్‌బాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీతంపేట కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ యలమర్తి శ్రీనివాసరావు, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎల్.శ్రీనివాసరాజు మాట్లాడుతూ మండలానికి 100 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సకాలంలో పంపిణీ చేస్తామన్నారు. గోడౌన్‌లో యూరియా బస్తాలు రికార్డులు ఎస్పీ తనిఖీ చేశారు. విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఏలూరు జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ అనిల్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

యూరియా కొరతపై అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు

భీమడోలు: యూరియా కొరతపై అసత్య ప్రచారాన్ని నమ్మి రైతులు ఆందోళన చెందనవసరం లేదని, జిల్లాలో 2వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. భీమడోలు సొసైటీ గుడౌన్, ప్రైవేటు దుకాణాలను రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులుతో కలిసి గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. భీమడోలు సొసైటీలో నిల్వ ఉన్న 3 టన్నుల యూరియా బస్తాలను ఆయన పరిశీలించి, అక్కడ సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ ఉషారాణి, సీఐ యూజే విల్సన్, ఎస్సై వై.సుధాకర్, డీఎస్పీ ఎస్.వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ శేషపు శేషగిరి, మాజీ జెడ్పీటీసీ కరణం పెద్దిరాజు, నీటి సంఘం అధ్యక్షుడు కుక్కల ప్రసాద్, రైతులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన పంటల పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న కేరళ బృందం

పెదవేగి: ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో కోకో పంటలు నాణ్యత ప్రమాణాలు పెంచడానికి రైతులు అవలంభిస్తున్న చర్యలను తెలుసుకోవడానికి, సలహాలు, సూచనలు ఇవ్వడానికి డాక్టర్ పి.చౌడప్ప ఫార్మర్ డైరెక్టర్, సీపీసీఆర్ఐ కేరళ బృందం పెదవేగి మండలంలోని పలు గ్రామాలను సందర్శించారు. గురువారం పెదవేగి గ్రామంలో ఆలపాటి సత్యనారాయణ ఆయిల్‌పామ్ తోట, కోకో ఒకే సంవత్సరం నాటారు. ఎకరాకు 160 కోకో మొక్కలు అంతర పంటగా వేశారు. ఎకరాకు 10 నుంచి 12 టన్నుల ఆయిల్‌పామ్, 250 నుంచి 300 కేజీల కోకో గింజల దిగుబడిని పొందుతున్నారు. ఉండవల్లి వెంకట్రావు తోటలో చెక్క పెట్టెలలో కోకో గింజల ఫెర్మెంటేషన్ చేయడం వల్ల నాణ్యత బాగుందని నాణ్యత ప్రమాణాలకి అనుగుణంగా రేటు ఇచ్చినట్లయితే రైతులు ఇదేవిధంగా పాటిస్తారని తెలిపారు. అనంతరం రామసింగవరం గ్రామంలో ఎడ్లపల్లి వెంకట కృష్ణారావు కొబ్బరిలో అంతర పంట కోకో, వక్క తోటలని సందర్శించారు.

కోళ్ల వ్యర్థాల స్వాధీనం

భీమడోలు: హైదరాబాద్ నుంచి కోడి వ్యర్థాలను భీమడోలు పంచాయతీ శివారు పెదలింగంపాడులో కె.నానికి చెందిన ఆక్వా చెర్వుకు తరలిస్తుండగా గురువారం భీమడోలు పోలీసులు అడ్డుకున్నారు. రెండు టన్నుల కోడి వ్యర్థాలను స్వాధీనం చేసుకున్నారు. వ్యాన్ యజమాని పెద్ద పొట్టి యాదగిరిపై ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేశారు.

వైభవంగా గణనాథుని నిమజ్జనోత్సవాలు



దెందులూరు: కోలాటమాడుతున్న భక్తులు



భీమడోలు: ఉత్సవ కమిటీ సభ్యులకు సూచనలిస్తున్న ఎస్సై

దెందులూరు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా దెందులూరులో గురువారం నూపాటి దిబ్బ సెంటర్‌లో స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కోలాటం నిర్వహించి అనంతరం స్వామి వారి ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. అలాగే గోపన్నపాలెంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గురువారం స్వామి వారికి పూజలు నిర్వహించి ఊరేగించారు.

పసుపు వర్ణంలో శ్రీమన్మహా గణనాథుడు

భీమడోలు: మండల వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాల్లో గురువారం గణనాధుని ఊరేగింపులు ఘనంగా నిర్వహించారు. లంబోదరుని ట్రాక్టర్లపై ఉంచి తీన్‌మార్ డప్పు వాయిద్యాలతో డీజే సౌండ్స్‌లో యువకులు నృత్యాలు చేస్తూ బాణాసంచా కాల్చుతూ వినాయకుని విగ్రహాలను ఊరేగించారు. భీమడోలులోని గణపతి సెంటర్‌లోని శ్రీమన్మహా గణనాథుని ఉత్సవాల్లో 9వ రోజు సంప్రదాయ పసుపువర్ణంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామాల్లోని గణనాథులను ఊరేగిస్తూ భీమడోలులోని గోదావరి కాలువలో వినాయకుని విగ్రహాలను నిమజ్జనం చేశారు.

నిమజ్జనాల్లో ఈత రాని వారు దిగొద్దు

భీమడోలు: నిమజ్జనం చేసే ప్రాంతాల్లో ఈత రాని వారు ఎట్టి పరిస్థితుల్లో నీటిలోకి దిగరాదని భీమడోలు ఎస్సై వై.సుధాకర్ అన్నారు. భీమడోలులో గురువారం రాత్రి గణనాథుని ఊరేగింపు, నిమజ్జనోత్సవంలో భాగంగా కమిటీ నిర్వాహకులు, యువకులకు ఎస్సై వై.సుధాకర్ వినాయక నిమజ్జనం సమయంలో పాటించాల్సిన భద్రత నియమ నిబంధనలపై వారికి సూచనలందించారు.

ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలి



ఉంగుటూరు: ఉపాధ్యాయులను సత్కరించిన విద్యార్థులు



పెదవేగి: ఉపాధ్యాయులను సత్కరిస్తున్న విద్యార్థులు



భీమడోలు: సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



గణపవరం: సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు



దెందులూరు: మాసగిరి శ్రీనును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

గణపవరం: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని, ఈ వృత్తిలో ఉన్నవారు నిబద్ధతతో పనిచేయాలని గణపవరం ఎంఈవో–1 రాజేష్, ఎంఈవో–2 గొర్రెల బాలయ్య అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని గురువారం గణపవరం నంబర్–1 పాఠశాలలో ఎంఈవోలు రాజేష్, టి.వి రామకృష్ణ, ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఎంఎస్ఎల్ఎస్ నారాయణ, తోట అప్పారావు, మూర్తి, స్టాన్లీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులుగా..

ఉంగుటూరు: కాగుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విద్యాబోధన చేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు వెలిచర్ల శ్రీనివాస్, సీతాల సత్యనారాయణ, జి.శ్రీనివాస్, కె.శ్రీనివాస్, రవిశంకర్ శ్రీవల్లి సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

పెదవేగి: తల్లిదండ్రుల తరువాత అత్యంత ప్రాధాన్యత ప్రాముఖ్యత గురువుకే దక్కుతుందని ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రామచంద్రపురంలో ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులని విద్యార్థులు ఘనంగా సత్కరించారు. రామచంద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, డాక్టర్ జి.కృష్ణ గంగాధర్‌రావు, డి.చంద్రశేఖర్, ఒ.మీనా, జి.రవికుమార్, అశోక్ కాసింబీబీ, వరలక్ష్మి, లీలా, సుభాషిణి, శిరోమణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమసమాజ నిర్మాతలు

భీమడోలు: సమసమాజ స్థాపనలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పలువురు అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు ప్రాథమిక పాఠశాలలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ముందు రోజైన గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం మండే సుధాకర్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇద్దరు ఎంపిక

నిడమర్రు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారానికి మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికైనట్లు ఎంఈవో అనూరాధ తెలిపారు. తోకపల్లి జెడ్పీ స్కూల్‌లో ఇంగ్లిష్ సహాయకులుగా ఉన్న షేక్ రంగావలి, నిడమర్రు ప్రైమరీ స్కూల్‌లో ఎస్జీటీగా పనిచేస్తున్న అడబాల అప్పారావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా నేడు ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించే గురుపూజోత్సవంలో అవార్డులు అందుకోనున్నారు. వీరిని ఎంఈవో–2 యర్రంశెట్టి శేషగిరిరావు, ఉపాధ్యాయ సంఘాల నేతలు అభినందించారు.

ఘనంగా గురుపూజోత్సవం

దెందులూరు: అంకిత భావంతో నిర్వహించే విధులు ఏ రంగంలోనైనా గుర్తింపు తీసుకొస్తాయని గోపన్నపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుభాషిణి అన్నారు. గురువారం గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవం నిర్వహించారు. పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసి చాట్రాయి ఎంఈఓగా పదోన్నతిపై వెళ్లిన మాసగిరి శ్రీనును ఉపాధ్యాయులు సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సుభాషిని మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దడంతో పాటు వారు ఎన్నుకున్న రంగాల్లో స్థిరపడేందుకు పునాదులు వేసి కృషి చేసే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు.